


# 'పరమానందయ్య శిష్యులే నయం'

శ్రీ మధురాంతకం రాజారాం

నాయుడుగారి కుమారులు
నారాయణ గోవిందులు
విద్యాగంధం ఎరుగని
వట్టి శుద్ధ దద్దమ్మలు.

కడుపు నిండుగా తినడం
కంటి నిండుగా నిద్రపోవడం
తప్పా తక్కిన లోకజ్ఞానం
తెలియని మూర్ఖాగ్రేసరులు.

ఆస్తిపరుండౌ నాయుడుగారు
అన్ని ఊళ్లనూ గాలించీ
చక్కని చుక్కల నిద్దరి దెచ్చి
సుతులకు పెండ్లిని జరిపాడు.

నాయుడుగారి కోడళ్లూ
నీరజ పద్మాదేవులు
సుగుణశోభితలు, విద్యావతులు,
సౌందర్యములో రతిదేవులు.

ఇంట కాలిడిన రెండు దినాలలో
భార్యలు భర్తల మంద బుద్ధిని
పసికట్టా, రొక నీతిపాఠమును
బోధించాలని తలిచారు.

"ఏమేమండీ! ఇటు రారండీ!
బుద్ధిని మీరు బృహస్పతులండీ!
మద్రాస్ వెళ్ళి మీరు మాడరన్ ఫేషన్
చీరలు రెండు తెచ్చియ్యండి!"

అనగానే మన బుద్ధిమంతులు
అంతా తెలిసిన సర్వజ్ఞులవలె
'వెళ్తామే, మరి తెస్తామే'
అంటూ పయనం గట్టారు.

పొగరు బట్టిన గుఱ్ఱంబులపై
జీనులువైచి కూర్చొన్నారు.
ఖనను ద్రొక్కుచూ హయరాజంబులు
వడిగా రోడ్డున దౌడు తీసినవి.

పుట్టినదాదిగ ఇల్లు వీడని
సోదరు లిద్దరు కండ్లు తిరుగగా
చెమటలు కారగ ఆయాసముతో
హయములపైనే మూర్ఛిల్లారు.
అడవిదారిలో గుంటనక్కలూ
'హూహూ' యనుచూ పర్వులెత్తగా
గుఱ్ఱాల్ రెండూ బెదిరిపోయినవి,
తిరిగి యింటికే దారి పట్టినవి.

రాతిరి రెండుఝాముల వేళకు
హయములు స్వంతయూరు చేరినవి
ఆ గ్రామములో నా రాత్రంబున
హరికథ యొకటి జరుగుచుండినది.

పట్టపగటివలె దీపాలెన్నో
ఉజ్వలకాంతితో వెల్గుచుండినవి.
అప్పటికప్పుడె తెల్వివచ్చిన
అన్న తమ్ముని తట్టిలేపెను.
"లేరా? లేరా! లేచి చూడరా!
చెన్నపట్టణము వచ్చి చేరితిమి!"
తమ్ముడు లేచి దిక్కు తెలియకా
'అన్నా ఉదయము చూడవచ్చులే
ఎటనైనా పడి నిద్రింతామనె.
నిద్రమత్తుచే తూలిపోవుచూ
సోదరు లిద్దరు స్వంత యింటికే
పోయి, అరుగుపై కూర్చొని హరికథ
వినెడి భార్యలతో అతి వినయముగా
"అమ్మా! భార్యలు మమ్ము బంపగా
చీరలు కొనుటకు చెన్నపట్టణము
వచ్చితిమమ్మా! ఈ రాత్రంబున
మేనువాల్చుటకు తావివ్వండమ్మా!"
నీరజ పద్మాదేవిని జూచెను,
పద్మయు నీరజముఖము గాంచెను.
కత్తివ్రేటునకు నెత్తురు లేకా
ఇద్దరి ముఖములు వాడిపోయెను.
నాయుడుగారు లోపలనుండీ
ఎవరచ్చట యని కేక వేసిరి.
'ఎవరో మామా! పరదేశులటా!
వచ్చి చూడు'డని నీరజ పిలచెను.
చుట్ట కాల్చుచూ నాయుడుగారు
సరసరసరమని బయటకు రాగా
వంగి దండములు పెట్టుచు కొడుకులు
సంగతి నిట్లని విన్నవించిరి:
"భార్యలకొరకై చీరలు కొనగా
చెన్నపట్టణము వచ్చితిమండీ!
తామరకుంటను గ్రామం బండీ!
రామానాయుడు మా నాన్నండీ!
రాత్రికి మాత్రము తావివ్వండీ!
నిస్తబ్ధుండగు నాయుడుగారిని
కోడం డ్రిట్టుల దెప్పిపొడిచిరి:
'మామయ్యా! నీ కుమారు లిద్దరు
పరమానందయ శిష్యులను
మించిపోయిన మేధావంతులు."

Source: Press Academy Website, Andhra Patrika - Sachitra Vara Patrika, Mar 28 1951

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/